క్లుప్తంగా

నేడు మెగా నేత్ర వైద్యశిబిరం

ఫిరంగిపురం: డాక్టర్ ఈశ్వరసాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా నేత్ర వైద్యశిబిరం గురువారం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ చిట్టా భరద్వాజ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని సెయింట్‌పాల్స్ హైస్కూల్‌లో నిర్వహించే శిబిరం శంకర కంటి నేత్ర వైద్యులు హాజరై పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. కొండవీడు ఈఎస్‌టీ వైద్యశాల వైద్యుడు కంజుల జగన్‌మోహన్ రెడ్డి, గుంటూరు తులసీ వైద్యశాల వైద్యుడు సోమశేఖరరెడ్డి ఆధ్వర్యంలో అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేయనున్నట్లు వివరించారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

ఫిరంగిపురం: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలోని పలుగ్రామాల్లో పేకాట, కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ ఎం.లక్ష్మీనారాయణరెడ్డి బుధవారం తెలిపారు. పందేలు నిర్వహించే వారిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏ ప్రాంతంలోనైనా పందేలు నిర్వహిస్తుంటే పోలీసు స్టేషన్‌లో సమాచారం అందజేయాలని చెప్పారు.

రక్తహీనతపై అవగాహన అవసరం

ఫిరంగిపురం: రక్తహీనతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.హేమలత పేర్కొన్నారు. మండలంలోని నుదురుపాడు సచివాలయంలో బుధవారం గర్భిణులు, బాలింతలకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఎత్తుకు తగిన విధంగా బరువు ఉండేలా చూసుకోవాలని చెప్పారు. పిల్లలకు ఆహారం పెట్టే సమయంలో వారి తల్లులు చేతులతో శుభ్రత పాటించాలన్నారు. పోషకాహారం ఇంటిలోనే తయారు చేసుకొనేలా వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి జోజప్ప పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలో రామచంద్రాపురంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేస్తున్న సమాచారం అందుకున్న ఎస్‌ఈబీ సిబ్బంది నిఘా ఏర్పాటు చేసి ట్రాక్టర్‌ను, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని తాడేపల్లి పోలీసులకు అప్పగించారు. ఎస్‌ఈబీ సబ్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు తెలిపిన వివరాలు.. రామచంద్రాపురం ఇసుక క్వారీలో దొంగతనంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో గుండిమెడ నుంచి కృష్ణానదిలో నడుచుకుంటూ వెళ్లి రెండు గంటల పాటు కృష్ణానదిలో గస్తీ నిర్వహించి ఇసుక లోడ్ చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. చిర్రావూరుకు చెందిన డ్రైవర్ ప్రశాంత్‌రాజును అదుపులోకి తీసుకుని తాడేపల్లి అప్పగించినట్లు వివరించారు. ఘటనపై తాడేపల్లి ఎస్‌ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఈబీ సబ్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు తెలిపారు.

తాగునీటి పైప్‌లైన్ల క్లీనింగ్

తాడేపల్లి రూరల్: కార్పొరేషన్ పరిధిలోని పోలకంపాడు ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి సరఫరా చేసే తాగునీటి పైప్‌లైన్లను కార్పొరేషన్ సిబ్బంది బుధవారం శుభ్రం చేశారు. తొలుత ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి బ్లీచింగ్ పౌడర్ కలిపిన నీటికి పైప్‌లైన్ల ద్వారా పంపించి, గంట అనంతరం నాలుగు ప్రాంతాల్లో పైప్‌లైన్లు డమ్మీలను విడదీసి ఆ నీటిని మొత్తాన్ని బయటకు పంపించి క్లీనింగ్ కార్యక్రమం చేసినట్లు వాటర్ వర్క్స్ సిబ్బంది తెలిపారు.

ఏఆర్ కానిస్టేబుల్ సస్పెన్షన్

మంగళగిరి: రాత్రి వేళల్లో యువకులను బెదిరించి నగదు వసూలు చేసిన ఘటనలో ఓ ఏఆర్ కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఖాదర్ బాషా గత కొంతకాలంగా నిర్మానుష్య ప్రదేశాల్లో యువకులు మద్యం తాగే వారిని బెదిరించి నగదు వసూళ్లకు పాల్పడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులకు సమాచారం అందడంతో విచారణ చేపట్టిన అధికారులు ఖాదర్ బాషాను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్‌శాఖ విజిలెన్స్ సిబ్బంది బుధవారం తనిఖీలు నిర్వహించారు. మొత్తం 2,209 సర్వీసులు పరిశీలించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఒక సర్వీసును గుర్తించి రూ.30 వేలు అపరాధ రుసుం విధించినట్లు ఈఈ కేవీఎల్ఎన్ మూర్తి తెలిపారు. విద్యుత్ అదనపు లోడు వినియోగిస్తున్న 46 సర్వీసులను గుర్తించి వారి నుంచి రూ.18,200 అపరాధ రుసుం వసూలు చేసినట్లు చెప్పారు. విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని అలా చేసినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఈఈ సీహెచ్ రమేష్, డీఈఈలు ఎం.సురేంద్రబాబు, పీవీఆర్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మేడికొండూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 12న గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ నాగరాజు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు. బోగి దృష్ట్యా గురువారం మరమ్మతులు చేస్తున్నామన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్లలో అన్ని వసతులు

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)



అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు గానూ కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ కేర్ సెంటర్‌లను నిర్మించినట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) పేర్కొన్నారు. మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి చినకాకానిలో రూ.1.30 కోట్ల వ్యయంతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ కేర్ సెంటర్‌ను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డితో కలసి బుధవారం ప్రారంభించారు. తొలుత సెంటర్‌లో ఏర్పాటు చేసిన దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొక్కలు నాటారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఎంటీఎంసీ పరిధిలో మొత్తం 9 సెంటర్లను నిర్మించగా ఇప్పటికే ఎనిమిది అర్బన్ సెంటర్లను ప్రారంభించినట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో 32 నూతన అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించడం జరిగిందన్నారు. మరో 17 హెల్త్ సెంటర్లను ఆధునీకరించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుల ప్రత్యేక చొరవతో తొమ్మిది సెంటర్లను నిర్మించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడారు. కార్యక్రమంలో చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవి, ఆరికటిక కార్పొరేషన్ డైరెక్టర్ శివరామ్ బాబాజీ, సొసైటీ చైర్మన్ పి.నాగేశ్వరరావు, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి, పార్టీ యూత్ విభాగం తాడేపల్లి మండల కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సంకా బాలాజీ గుప్తా, నాయకులు నాగయ్య, కమ్మెల సుబ్బారావు, గుత్తికొండ రామకృష్ణారెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ యు.శారదాదేవి, ఎస్ఈ శ్రీనివాసరావు, డీఈ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పెద్ద కోనేరు అభివృద్ధి పనులు పరిశీలన

నగరంలోని శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి చెందిన పెద్ద కోనేరు(కళ్యాణ పుష్కరిణి) అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) దేవస్థాన అధికారులకు సూచించారు. బుధవారం కోనేరు అభివృద్ధి పనులను పరిశీలించి స్వయంగా భారీ పొక్లెయిన్‌ను నడిపి మట్టి పూడిక తీశారు. కోనేరు అభివృద్ధి పనుల్లో భాగంగా నీటితోడిక వల్ల భూగర్భ జలాలకు ఇబ్బందులు లేకుండా పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ ఎ.రామకోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ మునగాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

- ఉత్సాహంగా...ఉల్లాసంగా పాల్గొన్న మహిళలు
- సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్న యువతులు
- విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే ఆర్కే



విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: నగర పరిధిలోని ఆటోనగర్‌లోని టిడ్కో నివాస గృహ సముదాయం వద్ద సంక్రాంతి పండుగ సందర్భంగా రోటరీక్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున స్థానిక మహిళలు పాల్గొని రంగవల్లులను తీర్చిదిద్దారు. యువతులు సంప్రదాయ వస్త్రధారణలో క్యాట్ వాక్ చేసి ఆకట్టుకున్నారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) పాల్గొని ముగ్గులపోటీల విజేతలకు, క్యాట్ వాక్ విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ మునగాల మల్లేశ్వరరావు, రోటరీ క్లబ్ ప్రతినిధులు ఇసునూరి అనిల్ చక్రవర్తి, సతీష్, టి.రామకృష్ణ పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శనలో విద్యార్థినికి పురస్కారం



పురస్కారం అందుకున్న విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మోతడక(తాడికొండ): నృత్య ప్రదర్శనలో తమ కళాశాలకు చెందిన విద్యార్థినికి నంది పురస్కారం లభించిందని మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీ రంగారావు తెలిపారు. ఈ నెల 8న సంక్రాంతి నంది పురస్కారాల కార్యక్రమాన్ని రాజమహేంద్రవరంలో ఎంపీ భరత్ ఆధ్వర్యంలో ఆనం కళా కేంద్రంలో పలురకాల నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ పోటీల్లో తమ కళాశాలలో డేటా సైన్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని జొన్నలగడ్డ ఈష చందన కూచిపూడి నృత్య ప్రదర్శనకు నంది పురస్కారం లభించిందని తెలిపారు. విద్యార్థిని ఈష చందనను ప్రిన్సిపాల్, కళాశాల చైర్మన్ వైవీ ఆంజనేయులు, సెక్రటరీ వై.సుజిత్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కే నాగ శ్రీనివాసరావు పలు విభాగాధిపతులు డాక్టర్ వీవీ సుబ్బారావు, సాయి శ్రీనివాస్ అభినందించారు.

భూసార పరిరక్షణ నానో యూరియాతో సాధ్యం

ఇఫ్‌కో జనరల్ మేనేజర్ జగన్ మోహన్ రెడ్డి



మాట్లాడుతున్న ఇఫ్‌కో జనరల్ మేనేజర్ జగన్ మోహన్ రెడ్డి

తాడికొండ: నానో యూరియా వాడకంతో భూసారాన్ని పరిరక్షించుకోవడంతో పాటు పర్యావరణ కాలుష్యాన్ని కాపాడుకోవచ్చని ఇఫ్‌కో జనరల్ మేనేజర్ ఎం.జగన్ మోహన్ రెడ్డి అన్నారు. తాడికొండ కో ఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో ఇఫ్‌కో కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ వంగా పోలారెడ్డి మాట్లాడుతూ రైతుల ప్రయోజనార్థం తమ సొసైటీలో నానో యూరియా అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఇఫ్‌కో స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, జిల్లా మేనేజర్ రఘు, సీఈఓ సుజని పాల్గొన్నారు.

కొలనుకొండలో స్పెషల్ గ్రాంట్ పనులు ప్రారంభం



కొలనుకొండలో స్పెషల్ గ్రాంట్ నిధులతో ప్రారంభించిన రోడ్డు నిర్మాణ పనులు

తాడేపల్లి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంటీఎంసీ కార్పొరేషన్‌కు 130 కోట్ల రూపాయలు స్పెషల్ గ్రాంట్‌ను మంజూరు చేశారు. ఈ గ్రాంట్ నుంచి బుధవారం కొలనుకొండలో రెండు సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. కొలనుకొండలోని వీరయ్య చౌదరి ఇంటి దగ్గర నుంచి ఎస్‌హెచ్ 16 వరకు 270 మీటర్ల పొడవున, 4 మీటర్ల వెడల్పుతో 31 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్‌నిర్మాణం, అలాగే జె. సర్వేశ్వరరావు ఇంటి నుంచి నల్లపు మాధవి ఇంటి మధ్య 35.5 లక్షల వ్యయంతో 315 మీటర్ల పొడవు, 3.5 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. కార్పొరేషన్‌లో విలీనమైన కొలనుకొండకు 6 కోట్ల రూపాయల వరకు నిధులు కేటాయించారు. త్వరలోనే అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆర్కే ప్రారంభించనున్నారు.

మత్తుతో జీవితాన్ని దుర్భరం చేసుకోవద్దు

తాడేపల్లి రూరల్: మత్తు పదార్థాలకు బానిసలై అందమైన జీవితాన్ని దుర్భరం చేసుకోవద్దని తాడేపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ డి. రమేష్ అన్నారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో తాడేపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా సంరక్షణ కార్యదర్శులు, మెప్మా రీసోర్స్ పర్సన్స్‌కు మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన తాడేపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ డి.రమేష్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు బానిసలైన విద్యార్థులకు, యువతను మనందరం సామాజిక బాధ్యతతో కాపాడాలని అన్నారు. నవజీవన్ బాలభవన్ క్లినికల్ సైకాలజిస్టు డాక్టర్ షీకా నికోలస్ మాట్లాడుతూ మహిళా సంరక్షణ కార్యదర్శులను 5 గ్రూపులుగా విభజించి మత్తుపదార్థాలు, సామాజిక మాధ్యమాల దుర్వినియోగంపై ప్రజంటేషన్ చేయించామని అన్నారు. ప్రోగ్రామ్ మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు మాట్లాడుతూ మత్తు పదార్థాల వ్యసనం నుండి బైటకు తీసుకురావడానికి డీ ఎడిక్షన్ చికిత్స ద్వారా తీసుకురావచ్చన్నారు. కార్యక్రమంలో జోనల్ కో ఆర్డినేటర్ బి.రమేష్ పాల్గొన్నారు.

దోస్త్ వాలీబాల్ విజేత రేవేంద్రపాడు



వాలీబాల్, పరుగు పందెంలో ప్రతిభకనబరిచిన విద్యార్థులు

తాడేపల్లి రూరల్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా దుగ్గిరాల వన్ సేవా ట్రస్ట్ (దోస్త్) ఆధ్వర్యంలో దుగ్గిరాల డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఆటల పోటీలలో రేవేంద్రపాడు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దోస్త్ నిర్వహించిన ఆటల పోటీలలో వాలీబాల్ పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచారని, అదే విధంగా 100 మీటర్ల పరుగు పందెం(బాలికలు)లో పి.ఖ్యాతి ద్వితీయ స్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో పి.జ్యోష్ణశ్రీ ప్రథమ స్థానం, షేక్ సైదా ద్వితీయ స్థానం, బాలుర విభాగంలో 200 మీటర్ల విభాగంలో ఎస్.సురేష్ ప్రథమ స్థానం సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీడీలు మెల్లెంపూడి రవి, డి.సుజాతలను విద్యాకమిటీ చైర్మన్ కె.ప్రకాశరావు, గ్రామ సర్పంచి మేరమ్మ అభినందించారు.

పేదలకు ఉపాధి కల్పించాలి

తాడేపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పాటు పేదలకు ఉపాధి కల్పించాలని సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరంలో పార్టీ నాయకులు సంక్షేమ పథకాల అమలుపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నవరత్నాల పేరుతో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో సరైన ఉపాధి దొరకడం లేదని అన్నారు. సీనియర్ నాయకుడు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ తాడేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ పనులు తగ్గడం వల్ల పేద ప్రజలు అప్పులు చేసి జీవిస్తున్నారని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వడ్డేశ్వరం సీనియర్ నాయకులు షేక్ పాపా సాహెబ్, వంగూరు రత్తమ్మ, బోడెమ్మ, వడ్డేశ్వరం సునీత పాల్గొన్నారు.

కాపు కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన జేఏసీ నాయకులు

తాడేపల్లి రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ కడప శేషును ఏపీ కాపు జేఏసీ సంఘం నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు అమ్మ శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ శ్రీ కృష్ణదేవరాయలు జయంతి, వర్థంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించి నిర్వహించాలని కోరినట్లు చెప్పారు. అదే విధంగా రాయల వారి పేరు మీద తిరుమల తిరుపతి కొండపై సత్రం నిర్మించాలని, 222 అడుగుల విగ్రహాన్ని నిర్మించాలని కోరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ కాపు జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పెన్నేరు దామోదర్, చొప్పకట్ల రవికుమార్, రాయలసీమ నుంచి పులివెందుల, గంగాల వీరు, తిరుపతి నుంచి హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ వీరన్న, మదనపల్లి నుంచి ఎద్దుల రామలింగ మోహన్ పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతల్లో రక్తహీనతకు చెక్

ఐనవోలు(తాడికొండ): అంగన్‌వాడీల్లో అందించే పోషకాహారంతో గర్భిణులు, బాలింతల్లోని రక్తహీనత సమస్యను పూర్తిగా పరిష్కరించవచ్చని తుళ్లూరు మండల ఈటీపీఆర్డీ సత్యకుమార్ అన్నారు. తుళ్లూరు మండలం ఐనవోలు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో రక్తహీనతపై అవగాహనా సదస్సు నిర్వహించారు. తక్కువ ఖర్చుతో అధిక పోషకాహారం అందే, ఐరన్ లోపం నివారించే ఆకుకూరలు, మునగాకు, పలు పోషకాహార పద్ధతులపై ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సౌజన్య, కార్యదర్శి ఏడుకొండలు పాల్గొన్నారు.

సంక్రాంతి సందర్భంగా పోటీలు

దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): దుగ్గిరాలలోని డాక్టర్ కేఆర్‌ఆర్ఎం డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సందర్భంగా పోటీలు నిర్వహించారు. దోస్త్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. గిరిధరరావు తెలిపారు.అనంతరం కబడ్డీ, రన్నింగ్, వాలీబాల్ పోటీలు నిర్వహించామని అన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సరళాదేవి పాల్గొన్నారు.

వైభవంగా కూడార్రై

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి పర్వతంపై ధనుర్మాసం సందర్భంగా గోదాదేవికి కుడార్రై ఉత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించినట్లు జీయర్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు గోదా అష్టోత్తర శతనామార్చన, అనంతరం నివేదన, పాశుర విన్నపం, కార్యక్రమాలు వైభంగా నిర్వహించామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు అందించారు.

హత్యపై కేసుపై ఏఎస్పీ విచారణ

మేడికొండూరు: పాలిటెక్నిక్ విద్యార్థి రావూరి చంద్రయ్య మృతిపై విచారణకు అడిషనల్ ఎస్పీ పి.అనిల్ కుమార్ డోకిపర్రులోని యూనివర్సల్ కళాశాలను బుధవారం సందర్శించారు. మండలంలోని నరసరావుపేట డోగిపర్రు యూనివర్సల్ కళాశాలలో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం విద్యార్థి రావూరి చంద్రయ్య గత సంవత్సరం ఏప్రిల్‌లో హత్యకు గురయ్యాడు. ఈ కేసు విచారణ నిమిత్తం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ పి.అనిల్‌కుమార్ కళాశాలలో సంఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, మృతుని తల్లిదండ్రులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రోడ్డు పక్కన ఆక్రమణల తొలగింపు

లాం(తాడికొండ): మండలంలోని లాం గ్రామంలో రోడ్డు పక్కన ఆక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలను పోలీసుల సహకారంతో పంచాయతీ సిబ్బంది బుధవారం తొలగించారు. జొన్నలగడ్డ అడ్డరోడ్డు వద్ద మలుపు వద్ద ఆక్రమణల కారణంగా రోడ్డు కుచించుకుపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. పక్కనే ఉన్న హోంసైన్స్ కళాశాల విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఆక్రమణలు తొలగించినట్లు ఈవో రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరసింహా పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

సగర కులస్తులను బీసీ-ఏ గ్రూపులో చేర్చాలి



మంగళగిరి: సగర కులస్తులను బీసీ-ఏ గ్రూపులో చేర్చాలని ఏపీ సగర సంఘ నేతలు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)కి వినతిపత్రం బుధవారం అందజేశారు. ఆయా రాష్ట్రాల్లో సగరులు ఎస్సీలుగా, ఎస్టీలుగా ఉండగా కేంద్ర ప్రభుత్వ జాబితాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సగరులు ఓబీసీల జాబితాలో ఉన్నామని తెలిపారు. ఏపీ జనాభా మొత్తంలో సగరులు 12 లక్షల మంది(2.5) శాతం మందిగా ఉన్నామని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం నాయకులు పందేటి సాంబశివరావు, కర్నాటి సత్యనారాయణ, తాడిశెట్టి గోపి, జూటూరి ఏడుకొండలు, కఠారి విష్ణుమూర్తి, గండికోట అచ్చయ్య, కలవకొల్లు గోపిబాబు, దుంపల సోములు, రెడ్డి రాంబాబు పాల్గొన్నారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రేవేంద్రపాడు(తాడేపల్లి రూరల్): పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉల్లాసంగా..ఉత్సాహంగా సాగింది. ఎంటీఎంసీ పరిధిలోని రేవేంద్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థులు ఎక్కడెక్కడో స్థిరపడినవారంతా కదిలివచ్చారు. పెదవడ్లపూడిలో బుధవారం నిర్వహించిన వేదికపై వారంతా కలుసుకున్నారు. 1976–76 బ్యాచ్ రేవేంద్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన విద్యార్థులు కలిసి సందడి చేశారు. అందరూ ఒకరిని ఒకరు పరిచయం చేసుకున్నారు. మొత్తం పూర్వవిద్యార్థులు 96 మంది ఉండగా, వారిలో 20 మంది మరణించారు. సమ్మేళనానికి హాజరైన 70 మంది తమ అనుభవాలను, గత స్మృతులను పంచుకున్నారు. కమిటీ సభ్యులు మాదల రమేష్‌బాబు, గొరినేని మధుసూదన ప్రసాద్, ఆలూరి వీరనారాయణ, లంకా రవికుమార్ సమ్మేళనానికి అవిరళ కృషి చేశారు.

తేమతో నిమిత్తం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

తాడేపల్లి రూరల్: ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న ధాన్యం నిబంధనలు విధించారని దాని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు అన్నారు. బుధవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ధాన్యం కల్లాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం చాలా మంచిదని, ఒకపక్క ప్రభుత్వం తేమశాతం ఎక్కువ ఉన్నా ధాన్యం కొనుగోలు చేయాలనిచెబుతున్నారు. గ్రౌండ్ లెవల్‌లో అధికారులు మాత్రం తేమశాతం ఎక్కువగా ఉంటే ధాన్యం కొనుగోలు చేయడం లేదని, దాని వల్ల వరి పండించిన రైతులు దళారులను నమ్ముకుని ప్రభుత్వం నిర్ణయించినధరకన్నా తక్కువ ధరకు అమ్ముకుంటున్నారని, అధికారులు, రైతు భరోసా కేంద్రాలో పనిచేసే సిబ్బంది తేమశాతం ఎక్కువగా ఉన్న ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజధాని డివిజన్ అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి, తాడేపల్లి రూరల్ సిపిఎం కార్యదర్శి వెంకటరెడ్డి, సంజీవరెడ్డి, ఉండవల్లి గ్రామ ఉపాధ్యక్షులు పి.వీరాస్వామి పాల్గొన్నారు.